




# విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అందుపుచ్చుకోవాలి

## కరింనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి డిసెంబర్ 29: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మార్తాండరావు స్మారక క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరింనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత స్థానంలో ఉంటారని అన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసం తో పాటు దేహ దారుఢ్యాన్ని పెంపొందిస్తాయి అని అన్నారు. స్నేహభావం సైతం పెరుగుతుంది అని అన్నారు . చెన్నాడి మార్తాండ రావు కష్టజీవి అని ఎన్నో కష్ట నష్టాలు ఓర్చి మంచి ఉన్నత స్థానాన్ని సంపాదించాడని కొనియాడారు. చదువు లేకున్నా నెంబర్ వన్ స్థానంలో ఉన్న వ్యక్తి మార్తాండ రావు అని విద్యార్థులు కూడా వారు అనుకున్న గోల్ ను చేరుకునేందుకు ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు గుంటి లతాశ్రీ, జోగినపల్లి ప్రేమ్ సాగర్ రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్తాండ రావు ట్రస్టు చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మి, డాక్టర్ మాదవి ,బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు చెన్నాడి అమిత్ కుమార్, మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, ఎంపీటీసీ సంభ బుచ్చమ్మ,నాయకులు గుంటి శంకర్ ,సంబ లక్ష్మి రాజం,విద్యార్థిని విద్యార్థులు నాయకులు ఉన్నారు.

# నాకు రేషన్ కార్డు వద్దు

### మా అమ్మకు పింఛను వద్దు

### బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



సరూర్‌నగర్, డిసెంబరు 29: మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన రేషన్‌కార్డును రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. తన తల్లికి పింఛన్ కూడా వద్దని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే తనలాంటి ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఆర్థిక స్థోమత ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వదులుకోవాలని ఆయన సూచించారు. బడంగ్‌పేట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 23 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ బాలాపూర్ సర్పంచ్‌గా, బడంగ్‌పేట్ నగర పంచాయతీ కౌన్సిలర్‌గా పని చేశానని, ప్రస్తుతం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్నానని పేర్కొన్నారు. 23 ఏళ్లుగా తన తల్లి పింఛను ఇప్పించమని అడుగుతున్నదని, అయినా తాను ఆ దిశగా ప్రయత్నం చేయలేదని చెప్పారు. తల్లిదండ్రులను పోషించలేని పిల్లలు ఉన్నవారికి మాత్రమే పింఛను ఇవ్వాలని, అనర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డుల వంటి పథకాలను అందించడం వల్ల అర్హులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని శేఖర్ అభిప్రాయపడ్డారు. ఎంతోకొంత ఆర్థిక స్థోమత ఉన్నప్పుడు ప్రభుత్వ పథకాలను పొందడం భావ్యం కాదని భావించి తాను రేషన్ కార్డును రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు.

# ఉపాధి హామీ కింద పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు

### నిర్మాణ పనులకు కార్యాచరణ సిద్ధం చెయ్యండి

### అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క



హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఫామ్‌పాండ్స్, ఫిష్ పాండ్స్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా భవనాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనుసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి గత ప్రభుత్వం రూ.800 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సచివాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో శు క్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కొత్త పథకాల రూపకల్పనకు సలహాలు ఇవ్వాలని కోరారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామీణాభివృద్ధి అధికారుల వేతనాల చెల్లింపు కోసం రూ.46 కోట్లు విడుదల చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీపకుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్ అన్నా రైతుబంధు రాలె..

### కేసీఆర్ ప్రభుత్వంలోనే బాగున్నదన్న మానుకోట రైతు

### మానుకోట జిల్లాలో రైతు మొర



మహబూబాబాద్, డిసెంబర్ 29 : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడి దశదిన కార్యక్రమానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊహించని పరిణామం ఎదురైంది. ఓ రైతు ఆయన దగ్గరికి వచ్చి అన్నా.. రైతుబంధు రాలేదని మొర పెట్టుకోవటం కనిపించింది. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్ద తండాలో శుక్రవారం సత్యవతి సోదరుడు గుగులోత్ కిషన్ నాయక్ దశదిన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియ, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణరెడ్డి హాజరై నివాళి అర్పించారు. కిషన్ నాయక్ కుటుంబసభ్యులను పరామర్శించి, ఇంటి బయటికి వస్తుండగా, ఒక్కసారిగా పెద్ద కేక వినిపించింది.

హరీశ్ అన్నా! అని ఓ రైతు గట్టిగా అరిచాడు. ఎవరా? అని అంతా అటువైపు చూశారు. ఆ వ్యక్తి హరీశ్‌రావు దగ్గరికి వచ్చి దీనంగా.. 'అన్నా! ఇంకా రైతుబంధు పడలే. పెట్టుబడికి ఇబ్బంది అవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రెండు పంటలకు ఠంచనుగా పెట్టుబడి సాయం పడేది. ఇప్పుడు ఇంకా పడలే' అని వివరించాడు. రైతు బాధను అర్థం చేసుకున్న హరీశ్‌రావు.. ఏమీ అనకుండా సైలెంట్‌గా ఉండిపోయారు. హామీ ఇద్దామంటే అధికారంలో లేరు, ప్రభుత్వంపై విమర్శలు చేద్దామంటే సరైన సమయం కాదని.. ఏమీ మాట్లాడకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా దశదిన కర్మకు వచ్చినవాళ్లంతా రైతుబంధు ఇంకా రాలేదన్న అంశంపైనే చర్చించుకోవటం కనిపించింది. దీనిపై వీరన్నను ఆరా తీయగా.. తనకు ఐదెకరాల భూమి ఉన్నదని, ఏటా వానకాలం, యాసంగిలో రెండు పంటలకు కేసీఆర్ ప్రభుత్వం సమయానికి రైతుబంధు ఇచ్చేదని తెలిపాడు. ప్రభుత్వం మారిన తరువాత ఇప్పటివరకూ రాలేదని తన ఇబ్బందిని వివరించాడు. ఐదెకరాల్లో రెండెకరాల్లో పొలం, మూడెకరాల్లో మిర్చి తోటను సాగు చేస్తున్నట్టు వెల్లడించాడు. ఐదు ఎకరాలకు ఈ సీజన్లో రూ.25,000 రావాల్సి ఉండగా, నయాపైసా రాలేదని చెప్పాడు. పనిచేసే ప్రభుత్వం రానందుకు ప్రతి ఒక్క రైతు బాధపడుతున్నాడని ఆవేదన వెలిబుచ్చాడు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలనకు భువనగిరి 10వ వార్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో భారీ స్పందన






## మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక వార్డు కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్ కుమార్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- హౌసింగ్ బోర్డ్ కాలనీలో ప్రజా పాలన కార్యక్రమంలో ఆర్డిఓ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న 6 గ్యారంటీలు అర్హులు అందరిరు దరఖాస్తులు చేసుకోవాలని రేషన్ కార్డు లేని వారు కూడా అప్లికేషన్ చేసుకోవాలని అన్నారు. డి ఆర్ డి ఎ పిడి నాగిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన అందరికీ పెన్షన్లు మంజూరు అవుతాయని అన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక వార్డు కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పార్కు జిమ్ గ్రౌండ్లో రోజు ఉదయం 8 గంటలకు మధ్యాహ్నం రెండు గంటలకు రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు పోలీస్ పెట్రోలింగ్ నిఘా ఉంటుందని రాత్రి వేళలో మన కాలనీ పిల్లల తల్లిదండ్రులు పర్యవేక్షణలో ఉండాలని అన్నారు. డిసిపి రాజేష్ చంద్ర మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీ నీ సేఫ్ జోన్ కాలనీగా తీర్చిదిద్దుతామని అన్నారు. పార్క్ కమ్యూనిటీ హాల్ జిమ్ గ్రౌండ్ లో సీసీ కెమెరాలు పెట్టిస్తామని అన్నారు.ఓవర్ స్పీడ్ గాడ్రైవింగ్ చేస్తున్న పిల్లల కోసం మన హౌసింగ్ బోర్డ్ కాలనీలో అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్లను వేయిద్దాం అని అన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డ్ కౌన్సిలర్ ఈరపాక నరసింహ,వార్డ్ అధ్యక్షులు మహమ్మద్ అమానుతుల్లా రిజ్వాన్ నితిన్ భాస్కర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ సర్వేశం సైదులు రెడ్డి, ప్రతాపరెడ్డి, ఆర్ పి సంతోషి,కవిత కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌకర్యం కల్పించాలి



దుబ్బాక (వాయిస్ టుడే) ప్రతినిధి డిసెంబర్ 29, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని పద్మనాభం పల్లి గ్రామ ఆమ్లెట్ విలేజ్ మర్రికుంట గ్రామ శివారులో ఇటీవల రోడ్డు వెడల్పులో విద్యుత్ స్తంభా%శీ%తో తొలగించడంతో రాత్రిపూట గ్రామాల్లోకి వెళ్లే మార్గం అంత చీకటి మాయమైంది. దీంతో ఆ రోడ్డు గుండా రాత్రి వెళ్ళాలో నడవాలంటే మహిళలు, చిన్నారులు, గ్రామస్తులంతా జంకుతున్నారు ఎల్కతుర్తి నుంచి మెదక్ వరకు గత ఏడు నెలల కిందట నేషనల్ హైవే మంజూరు అవడంతో హైవే కి ఆనుకొని ఉన్న ఆ స్తంభాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని పద్మనాంపల్లి గ్రామంలో విద్యుత్ జయకృష్ణకి గ్రామ సర్పంచ్ పర్శరాములతో కలిసి మర్రికుంట వాసాలు వినతి పత్రం అందించారు అనంతరం తాము ఎదుర్కొంటున్న సమస్యను తీర్చాలని ఏఈకి కలిసి సమస్యను విన్నవించారు రోడ్డు కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఏఈ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ కూర రాములు, రమేష్, యాదగిరి ,మల్లేశం, గోపాల్, కిష్టయ్య, కొట్టే రాములు, తదితరులు పాల్గొన్నారు.



# పదవికి రాజీనామా చేసిన బైంసా ఎంపిపి

నిర్మల్ జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 29 : బైంసా మండల పరిషత్ అధ్యక్షురాలు కల్పనా తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రాజీనామా ప్రతిని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఈఓ కు అందజేశారు.నిన్న వైస్ ఎంపి పి నేడు ఎంపిపి రాజీనామాలు చేయడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నవారు బిఆర్ఎస్ పార్టీకి సైతం వారి రాజీనామా చేశారు. అప్పట్లో ఒకే ఒక్క స్థానంతో బిఆర్ఎస్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం ఎమ్మెల్యే రామారావు పటేల్ గెలవడంతో బైంసా మండలంలో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. ఎంపీటీసీలు అంతా బీజేపీ పక్షాన చేరుతుండడంతో ఇక ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాన్ని త్వరలో బిజెపి కైవసం చేసుకోనుంది. దీంతో బైంసా మండల రాజకీయాల్లో ఇదే చర్చ జరుగుతుంది ముధోల్ రాజకీయాల్లో స్థానిక సంస్థలన్నీ తన వైపు చేసుకునేలా ఎమ్మెల్యే రామారావు పటేల్ చక్రం తిప్పుతున్నారు.




# కుబీర్ బస్టాండ్ బాత్రూంలను పట్టించుకోవాలి



నిర్మల్ జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 29: కుబీర్ బస్టాండు ప్రాగణంలో నిరుపయోగంగా బాత్రూంల వలన మహిళలు ఇబ్బందికి గురి అవుతున్నారు. బాత్రూంలను బాగు చేసి మహిళకు వాడుకునే విధంగా చెయ్యాలని సోషలిట్స్ జస్ట్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుబీర్ మండల చైర్మన్ సాప పండరి డిమాండ్ చేశారు.అనంతరం డిపో మేనేజర్ అమృత వినతి పత్రం ఇచ్చారు.డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు ప్రకాష్ పటేల్ మహిళలు,పాల్గొన్నారు.

# భార్యాభర్తలను కలిపిన 'ప్రజాపాలన'

### 15 ఏళ్లుగా ఒకే ఊర్లో వేర్వేరుగా వృద్ధ దంపతులు

### ఇల్లు, పింఛన్ కోసం వేర్వేరుగా దరఖాస్తులు

### పథకాలపై హామీ ఇచ్చి కలిపిన అధికారులు

కొందుర్గు, డిసెంబరు 29: పదిహేనేళ్లుగా కనీసం పలకరించుకోకుండా విడివిడిగా ఉంటున్న వృద్ధ దంపతులను 'ప్రజా పాలన' కలిపింది. అధికారుల చొరవ.. పథకాలపై హామీతో స్పర్థలు వీడి జీవన మలిసంధ్యలో చేతులు కలిపారు. ఆ దంపతులు రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలాపేట్‌కు చెందిన గొంగుపల్లి నరసింహులు (70), లక్ష్మమ్మ(65). వీరికి సుభానయ్య(40) సురేశ్ (35) కుమారులు. ఇద్దరూ పెళ్లిళ్లు చేసుకొని భార్యాపిల్లలతో లాలాపేట్‌లోనే వేర్వేరు ఇళ్లలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. నరసింహులు, లక్ష్మమ్మ చిన్న చిన్న గొడవల వల్ల పదిహేనేళ్ల క్రితం విడిపోయారు. కలిసి ఉండాలంటూ గ్రామస్థులు ఎన్నోసార్లు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. నరసింహులుకు వృద్ధాప్య ఫించన్ వస్తోంది.

ఆయన ఒంటరిగా రేకుల షెడ్డులో ఉంటున్నాడు. లక్ష్మమ్మ కూడా మరో రేకుల షెడ్డులో ఉంటోంది. ఆమె అవసరాలకు కొడుకులు డబ్బు ఇస్తున్నారు. శుక్రవారం నరసింహులు తనకు ఇల్లు కావాలంటూ.. లక్ష్మమ్మ తనకు పింఛన్ కావాలంటూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన అధికారులు.. దరఖాస్తుల్లో ఒక్కరి పేరే ఎందుకు ఉందని ఇద్దరినీ అడిగితే తాము ఎప్పుడో విడిపోయామని చెప్పారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఉప తహసీల్దార్ కృష్ణ, సర్పంచ్ రాంరెడ్డి ఆ దంపతులతో మాట్లాడారు. ముసలితనంలో విడివిడిగా ఉండడం వల్ల ఇద్దరూ ఇబ్బందులు పడుతున్నారని, కలిసి ఉంటే ఒకరినొకరు తోడుగా ఉంటారని నచ్చజెప్పారు. కలిసి ఉంటే కోరిన విధంగా ఇల్లు, పింఛన్, సబ్సిడీపై గ్యాస్ ఇచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో వృద్ధ దంపతులు కలిసి ఉండేందుకు ఒప్పుకున్నారు.